ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
30 అక్టోబర్
2025



# కోమటిరెడ్డి మంజులరాణి కీర్తి వెలుగుల పతాక

"మూడు దశాబ్దాల పాటు తన ప్రగతిలో, పోరాటంలో కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి సహచరిగా ఉన్న మంజులరాణి ఇక లేరన్న వాస్తవం డాక్టర్ గోపాల్ రెడ్డిని చలన రహితునిగా మార్చింది. ఆయన ఆలోచనల్లో, కార్యాచరణలో ఆమె లోటు ఎప్పటికీ పూడ్చలేనిది. అయితే, మంజులరాణి తన జీవితాన్ని ఒక దీపంలా వెలిగించి, ఆ వెలుగులను భర్తకు, లోటస్ ల్యాప్ సంస్థలకు ప్రసాదించారు. విద్యారంగంలో, పర్యావరణ పరిరక్షణ రంగంలో వినూత్నమైన ఆలోచనలతో ముందుకు సాగుతున్న డాక్టర్ కోమటిరెడ్డి కి దివంగత మంజులరాణి ఒక దీపమై సరికొత్త వెలుగులు పంచి కొనసాగుతున్న కీర్తి నలుదిశలా ప్రకాశించాల్సిన అవసరముంది. ఆమె ప్రేరణతో నడిచే లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ దిల్‌సుఖ్‌నగర్-హైదరాబాద్, మరియు వారి ఇతర పాఠశాలల విద్యార్థులు ఉన్నత శిఖరాలు సాధనకు నిన్నటివరకు ఆమె చేసిన నిరంతర శ్రమే కొలమానం, కలికితురాయి కాగలదు. మంజులరాణి భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆమె నాటిన మొక్కలు, ఆమె చదివించిన విద్యార్థులు, ఆమె డాక్టర్ గోపాల్ రెడ్డికి అందించిన సలహాలు... ఇవన్నీ ఆమె స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచి, ఈ లోకంలో ఆమె ప్రయాణ విలువల ప్రపంచాన్ని సదా సజీవంగా ఉంచుతాయి"





**మంజులారాణితో గోపన్న ప్రయాణం... విజయానికి సోపానం!!**

**పర్యావరణం అంటే ఆమెకు ప్రాణం**

**గోపన్నకు ఆమెతో విలువలతో కూడిన మజిలీ...!!**

**విలువల ప్రపంచం - ఒక స్ఫూర్తి ప్రదాత మంజులరాణి**

**నేడు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి సతీమణి, లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, ప్రభుత్వ కళాశాల లెక్చరర్ దివంగత మంజులరాణి దశదినకర్మ సందర్భంగా నివాళులు**

ఎల్బీనగర్, రోమింగ్ న్యూస్: మొక్కవోని దీక్ష, విధుల్లో రాజీలేని వృత్తిధర్మం మరణం దేహం వరకే పరిమితం. కానీ వ్యక్తిత్వం, ఆశయాలు, జీవన విధానం... ఇవన్నీ కాలాతీతమై, స్ఫూర్తిగా నిలిచియుంటాయి. లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ అధినేత డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి అర్ధాంగి, మంజులరాణి జీవనం కూడా సరిగ్గా ఇదే సత్యాన్ని చాటుతుంది. నేడు ఆమె దశదినకర్మ సందర్భంగా... ఆమెతో డాక్టర్ గోపాల్ రెడ్డి పంచుకున్న విలువల ప్రపంచాన్ని స్మరించుకోవడం ఎంతో సముచితంగా భావించి రోమింగ్ న్యూస్ ఈ కథనాన్ని అందిస్తున్నాం.

కోమటిరెడ్డి మంజులారాణి కేవలం ఒక గృహిణి మాత్రమే కాదు, ఆమె ఆదర్శనీయమైన విద్యాధికురాలు. ప్రభుత్వ కళాశాల లెక్చరర్‌గా తన వృత్తిని ప్రారంభించి, డాక్టర్ గోపాల్ రెడ్డికి బలమైన వెన్నెముకగా నిలిచారు. నిరంతరం శ్రమించడం, విధి నిర్వహణలో ఒక్క క్షణం కూడా రాజీ పడకపోవడం ఆమె వ్యక్తిత్వానికి పునాది. కానీ విధి ఆమె పట్ల కఠినంగా వ్యవహరించింది. 2000 వ సంవత్సరంలో దురదృష్టవశాత్తు అనారోగ్యం పాలై, ఎడమ చేయి, కాలు పూర్తిగా సహకరించని పరిస్థితికి చేరుకున్నారు. ఈ విపత్కర పరిస్థితి ఎవరికైనా నిస్సత్తువను కలిగించవచ్చు, కానీ మంజులరాణి సంకల్ప బలం ముందు ఆ అనారోగ్యం తలవంచింది.

శరీరం సహకరించకపోయినా, ఆమె తన వ్యక్తిధర్మాన్ని కానీ, వృత్తిధర్మాన్ని కానీ ఎక్కడా విస్మరించిన దాఖలా లేదు. తన విధిని, లక్ష్యాన్ని సదా శిరసావహించడం ఆమెకు అలవాటు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా, ఆమె తన ఉద్యోగ ధర్మంలో ఒక్క రోజు, ఒక్క నిముషం కూడా సెలవు తీసుకోలేదు, విధులకు హాజరు కాకుండా ఉండలేదు. ఆమెలోని ఆ దక్షత, నిబద్ధత ఇతరులకు అసాధ్యంగా అనిపించవచ్చు. అందుకే ఆమె ఒక ఆదర్శమూర్తి. లోటస్ ల్యాప్ స్కూల్ డైరెక్టర్‌గా ఆమె అందిస్తున్న సలహాలు, సూచనలు సంస్థ ఉన్నతికి నిరంతరం దోహదపడ్డాయి.

### జిజ్ఞాసకు మారు పేరు...విద్యా ఔన్నత్యానికి ప్రతీక..!!

కోమటిరెడ్డి మంజులరాణికి జీవితంలో నాలుగు విషయాలు అపారమైన ఆనందాన్ని, కుతూహలాన్ని, వ్యసనాన్ని, మరియు ఫ్యాషన్‌ను ఇచ్చాయి. అవే.. అక్షరాన్ని విశ్వవ్యాప్తం చేయడం, పేదవారికి చదువును దగ్గర చేయడం, పర్యావరణాన్ని రక్షించడం, మొక్కలకు ప్రాణం పోయడం. ఈ ఆశయాలను ఆమె కేవలం మాటలకే పరిమితం చేయకుండా, తన ప్రతి శ్వాసలోనూ, చర్యలోనూ జీవించారు. ఆమెకు అక్షరం అంటే విద్య. కేవలం పాఠశాల విద్యనే కాదు, ప్రతి పేద విద్యార్థికి చదువును అందుబాటులోకి తేవాలనే కుతూహలం ఆమెలో బలంగా ఉండేది. లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ ద్వారా వందలాది పేద పిల్లలకు విద్యాదానం అందుకోవడం ఒక స్ఫూర్తి . ఆమె ఆలోచనలు, డాక్టర్ గోపాల్ రెడ్డి కృషికి తోడై, అనేక విద్యా సంస్థల ద్వారా వేలాదిమంది విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదగడానికి దోహదపడింది.





### పర్యావరణం మంజులరాణికి ప్రాణం

ఆమెకు పర్యావరణాన్ని రక్షించడం ఒక వ్యసనం. మొక్కలకు ప్రాణం పోయడం ఒక ఫ్యాషన్. తన వ్యక్తిగత జీవితంలోనూ, పాఠశాల ప్రాంగణంలోనూ పచ్చదనం, పరిశుభ్రత పట్ల ఆమెకున్న శ్రద్ధ ఎంతో గొప్పది. ఈ నిరంతర శ్రమ, మొక్కవోని కృషి, మరియు సమాజానికి సేవ చేయాలనే జిజ్ఞాస ఆమెకు పూర్తి స్థాయిలో సహకరించని ఆరోగ్యాన్ని సైతం ఆమడ దూరం నెట్టివేసేంత శక్తిని ఇచ్చాయి. అనారోగ్యాన్ని లెక్కచేయకుండా, తన ఆశయాల సాధనలో ఆమె నిరంతరం ముందుకు సాగారు.

### కోమటిరెడ్డి గోపాల్ రెడ్డికి వెన్నుదన్నుగా నిలిచిన మంజులరాణి

డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మూడు దశాబ్దాల సుదీర్ఘ విద్యా, సామాజిక ప్రయాణంలో మంజులరాణి ఆలోచనల్లో, విలువల ఆచరణలో, విద్యా వ్యాప్తిలో, పర్యావరణ పరిరక్షణ పోరాటంలో చేదోడు వాదోడుగా నిలిచారు. విద్యారంగంలో ఆయన ప్రయాణంలో ప్రతి మలుపుకీ ఆమె ఆలోచనలు మరింత వన్నె తెచ్చేవి. అందుకే డాక్టర్ గోపాల్ రెడ్డి విద్యావేత్తగా అసమాన ప్రతిభాశాలిగా పేరు దక్కించుకున్నారు. ఆ కీర్తి, ఆ గొప్పదనం కేవలం ఆయన ఒక్కరిది కాదు, వారిరువురి ఆలోచనల సారమని లోకానికి తెలుసు.

### అపార అనుభవాల సమాహారం... మంజులారాణి

మంజులరాణి జీవితం అపారమైన సంకల్పంతో నిండి ఉన్నా, శరీరం అలసిపోయే భావనను ఆమె ముందుగానే గ్రహించగలిగారు. బహుశా తన భవిష్యత్ పరిణామాలను ముందుగా అంచనా వేశారేమో. ఈ నెల 21న కన్నుమూసేందుకు కేవలం మూడు రోజుల ముందుగానే ఆమె ఆసుపత్రికి చేరుకున్నారు. దురదృష్టవశాత్తు, ఆమె అనుమానం నిజమైంది. అమెరికా పర్యటనలో ఉన్న డాక్టర్ గోపాల్ రెడ్డికి ఈ విషయం పిడుగులాంటి వార్త. విద్య ఔన్నత్యం, పర్యావరణ పరిరక్షణ రంగాల్లో మరిన్ని ఆవిష్కరణల పరిశీలన కోసం అమెరికా నలుమూలలా తిరుగుతున్న ఆయన, తన సతీమణి అంపశయ్యపై ఉన్న విషయం తెలుసుకుని ఆఘమేఘాలపై పర్యటన రద్దు చేసుకుని వచ్చారు. ఆలస్యంగా వచ్చినా, ఆ భగవంతుడు ఆయనకు కల్పించిన ఒక గొప్ప అదృష్టం... జీవన సహచరి మంజులరాణి చివరి చూపు, ఆఖరి క్షణాలు ఆయన చేతుల్లోనే ముగియడం గమనార్హం. ఆమె ఆశయాలు కొనసాగింపుగా గోపాల్ రెడ్డి ముందుకు సాగాలని... ప్రతి ఒక్కరు కోరుతున్నారు. సేవా తత్పరతకు మారుపేరుగా నిలిచిన గోపాల్ రెడ్డి ప్రయాణం ఇక ఒంటరిగా కాదు... ఆమె ఆశయాలు గోపాల్ రెడ్డితో ఎప్పుడూ కలిసి ఉంటూ ముందుకు సాగడానికి అవసరమైన ధైర్యాన్ని ఇస్తుందని ఆయన శ్రేయోభిలాషులు సన్నిహితులు భావిస్తున్నారు. రోమింగ్ న్యూస్ దినపత్రిక పక్షాన ఎస్.వీ.ఎన్ విద్యాసంస్థల పక్షాన ఆమెకు నివాళులర్పిస్తూ కోమటిరెడ్డి గోపన్న స్ఫూర్తివంతమైన జర్నీని కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నాం.










